క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నేడు

రేపల్లె రూరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని పేర్కొన్నారు.

16న క్రీస్తు రక్షకుని ఆలయం వార్షికోత్సవం

భట్టిప్రోలు: భట్టిప్రోలులోని క్రీస్తు రక్షకుని దేవాలయం వార్షికోత్సవం ఈ నెల 16న నిర్వహించనున్నట్లు విచారణ గురువు రవి కుమార్, సహాయక గురువులు జయరాజ్, మార్టీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రెవరెండ్ పాదర్ తుమ్మా జయపాల్, రెవరెండ్ కొమ్మారెడ్డి ప్రభాకర్ విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు పెసర్లంకలో ఉచిత మెగా వైద్య శిబిరం

భట్టిప్రోలు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని గ్రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పెసర్లంక దేవభక్తుని కోటయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు చైర్మన్ కైతేపల్లి షాలేమ్ రాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య నిపుణులు డాక్టర్ టి.ఉమాశంకర్, డాక్టర్ ఆషా కలిశెట్టి, డాక్టర్ వై.రాకేష్ కిరణ్, డాక్టర్ పి.శ్రావణ్ కుమార్ వైద్య పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్ కార్డు తెచ్చుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

మే లోనే మండల కేంద్రాలకు 'విద్యా కానుక' కిట్లు



వేమూరు: జగనన్న విద్య కానుకలను వాహనాల ద్వారా పాఠశాలలకు అందించడం జరుగుతుందని విద్యా కానుక రాష్ట్ర పరిశీలకులు మేరీ సుశాన్ తెలిపారు. 2023–2024 విద్యా సంవత్సరంలో జగనన్న విద్యా కానుక కిట్లు భద్ర పరిచేందుకు గదులు పరిశీలించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో నాలుగు గదులను ఆమె పరిశీలించారు. ప్రభుత్వం జగనన్న విద్యా కానుక కిట్లు మే 1 నుంచి 31 వరకు మండల కేంద్రంలోని పాఠశాలల్లో భద్రపరచడం జరుగుతుందన్నారు. జూన్‌లో ప్రభుత్వ వాహనాలు ద్వారా జగనన్న పాఠశాలలకు పంపించడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ సిబ్బంది రాజ వర్ధన్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికలో విద్యార్థుల సత్తా..



బాపట్ల : బాపట్ల వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూలో మంచి ఉద్యోగాలు సాధించారని కళాశాల డీన్ డాక్టర్ బి.డి.స్మిత్ తెలిపారు. మహేంద్ర ట్రాక్టర్ కంపెనీ నుంచి గురువారం జరిగిన ఇంటర్వ్యూలో డి.సురేంద్ర, హర్షవర్ధన్‌రెడ్డికి ఏడాదికి రూ.6.5లక్షలు ప్యాకేజీ లభించిందని తెలిపారు. డాస్ ఫౌండేషన్ నిర్వహించిన ప్రాంగణ నియామకాలలో రూ. 4.2 లక్షల వార్షిక వేతనంతో 9 మంది విద్యార్థులు టి.సురేంద్ర, వాణిశ్రీ, ఉషశ్రీ, భార్గవి, చాందిని, ప్రియ వెంకట సాయి, నాగ దీక్షిత, సాయి చరణ్ తేజ, మహేశ్వరీ దేవిలు ఎంపికయ్యారని తెలిపారు. వీరిని కళాశాల ప్రాంగణ ఎంపిక అధికారి డాక్టర్ ఎస్.విష్ణువర్ధన్, ఆచార్యులు, ఇతర విభాగపు అధిపతులు అభినందించారు.

ట్రైనీ డిప్యూటీ కలెక్టర్‌కు సన్మానం



వేమూరు: మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖలపై శిక్షణ పొందిన డిప్యూటీ కలెక్టరు జాన్ లిర్విన్‌ను ఎంపీపీ యల్లమాటి మోహన్ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ.. డిప్యూటీ కలెక్టరు జాన్ లిర్విన్ మాట్లాడుతూ ఈ నెల 2 నుంచి 13 వ తేదీ వరకు జగనన్న కాలనీ గృహ నిర్మాణం, అన్ని శాఖలపై పూర్తిగా శిక్షణ పొందినట్లు చెప్పారు. సహకరించిన సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సునీత పాల్గొన్నారు.

ఆహార విజ్ఞానంపై..అధ్యయనం

- విదేశాల్లోని ప్రముఖ వర్శిటీల్లో.. ఆహార విజ్ఞాన సాంకేతిక విద్యార్థినుల శిక్షణ
- విజయవంతంగా అధ్యయనం పూర్తి
- ఆరోగ్యకరమైన ఆహారానికి ప్రాధాన్యం
- ఎంతో ఉపయుక్తం అంటూ అనుభవాల విశ్లేషణ



పరిశోధన చేస్తున్న సాయిప్రసన్న



థాయ్‌ల్యాండ్‌లో పరిశోధన చేస్తున్న తేజశ్వినీ

బాపట్ల: బాపట్ల ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాల విద్యార్థినులు రెండు నెలల విదేశీ శిక్షణను విజయవంతంగా ముగించుకున్నారు. విదేశాల్లో ఆహార ఉత్పత్తుల తయారీలో అచరిస్తున్న విధానాలు– పరిశోధనలలో భాగస్వాములు కావటం ద్వారా ఎంతో అనుభావాన్ని గడించామని విద్యార్థినులు తమ అనుభవాలను పంచుకున్నారు. బాపట్ల కళాశాల నుంచి ఆరుగురు ఈ ప్రోగ్రామ్‌కు ఎంపికయ్యారు. వీరు ఫిబ్రవరి, మార్చి నెలల్లో శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం మొత్తం ఖర్చులు భరించింది. ఎస్.బిందుశ్రీ అమెరికాలోని కాన్సాస్ స్టేట్ యూనివర్శిటీకి, ఎస్.మమత ఫిన్లాండ్‌లోని టెంపియర్ విశ్వవిద్యాలయానికి, వి.సాయి ప్రసన్న యూనివర్శిటీ ఆఫ్ మలేషియా కేలన్‌టన్‌కు, జి. తేజస్విని థాయలాండ్‌లోని క్వీన్ శింకిట్ బొటానికల్ గార్డెన్ ఆర్గనైజేషన్‌కు, పి. హారిక, జి.ఆర్.కె.ఎల్ శ్రియ అంతర్జాతీయ ట్రెనింగ్ వెజిటేబుల్ సెంటర్ తైవాన్‌కు శిక్షణ కోసం ఎంపికయ్యారు. వీరి ఎంపికకు ప్రొఫెసర్లు డాక్టర్ ప్రతాప్ కుమార్‌రెడ్డి, డాక్టరు మణి, డాక్టరు రాధా, డాక్టరు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, డాక్టరు విమల్ బీరా, డాక్టరు బ్లెసీ ప్రోత్సాహం అందించారు.

శిక్షణ ఎంతో ఉపయోగపడింది..



ల్యాబ్‌లో చిన్న మొక్కలను పెంచి, వాటిని భూమిలో నాటడం వరకు ఏ విధంగా జాగ్రత్తలు తీసుకోవాలనేది నేర్చుకున్నా. ఈ శిక్షణతో ఆహార పదార్థాల తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుసుకున్నా. ఈ శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంది.

–బిందుశ్రీ, అమెరికా శిక్షణ విద్యార్థిని.

ఆరోగ్యకరమైన ఆహారంపై అవగాహన



మలేషియా ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారం తయారీపై ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. ఇందుకు సాంకేతిక పద్ధతులను అధ్యయనం చేశాను. ఈ అధ్యాయానికి యూనివర్శిటీ నుంచి మంచి ప్రోత్సాహం లభించింది.

–వి.సాయి ప్రసన్న, మలేషియా శిక్షణ విద్యార్థిని.

వ్యవస్థాపకతకు అధిక ప్రాధాన్యం



మొక్కలు పెంపకంలో అవలంభిస్తున్న మార్పులను నేర్చుకున్నాం. వివిధ విశ్వవిద్యాలయాలను పరిశీలించాను. అక్కడ వ్యవస్థాపకతకు ఎక్కువ ప్రాధాన్యం కల్పిస్తారు. అది నాకు బాగా నచ్చింది.

–జి.మమత, ఫిన్‌ల్యాండ్ శిక్షణ విద్యార్థిని.

పుట్టగొడుగుల పెంపకంపై అధ్యయనం



పుట్టగొడుగుల పెంపకంపై ఎక్కువ అధ్యయనం చేశాం. క్వీన్ శిరికిట్ బొటానికల్ గార్డెన్ ఆర్గనైజేషన్ నుంచి ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. ఫైటో కెమిస్ట్రీ, టిష్యూ కల్చర్‌పై ఎక్కువ అధ్యయనం చేశాం.

–జి.తేజశ్వినీ, థాయ్‌ల్యాండ్ శిక్షణ విద్యార్థిని.

మృతుడి కుటుంబానికి మంత్రి పరామర్శ



మృతదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి నాగార్జున

వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరుకు చెందిన పాముల భాగ్యరాజ్ అనే వ్యక్తి మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతని మృతదేహాన్ని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున గురువారం సందర్శించి, నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు గ్రామానికి చెందిన మోటూరి చౌదరి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు మేరుగ చలంబాబు, చీకటి కోటేశ్వరరావు, నున్నం ఆనంద్, పుట్టి శ్రీనివాసరావు, జడా ముక్తేశ్వరరావు, గురిందపల్లి సునీల్ పాల్గొన్నారు.

లబ్ధిదారులు గృహాలు నిర్మించుకునేలా చూడాలి



సిబ్బందితో సమీక్షిస్తున్న ప్రత్యేక అధికారి హనుమంతరావు

పల్లెకోన(భట్టిప్రోలు): సచివాలయ సిబ్బంది వైఎస్సార్ జగనన్న కాలనీ లబ్ధిదారులతో గృహ నిర్మాణాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి, పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎం.హనుమంత రావు సూచించారు. పల్లెకోన సచివాలయాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ వారంలో కనీసం 50 గృహ నిర్మాణాలు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. గత వారం తాను పరిశీలించిన అంగన్‌వాడీ కేంద్రాలను, పాఠశాలలను సందర్శించి, మార్పులను గమనించి సంతృప్తి వ్యక్తం చేశారు. హౌసింగ్ ఏఈ రావూరి సౌమ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, వీఆర్వో బాల కోటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

తెనాలిరూరల్: పేకాట శిబిరంపై పోలీసులు గురువారం ఆకస్మిక దాడి చేశారు. నంది వెలుగు గ్రామ పరిధిలోని పొలాల్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.9,050లు, ఆరు సెల్ ఫోన్లు, మూడు బైక్‌లు, స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో శుక్రవారం హాజరుపర్చనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధి హామీ పథకాన్ని కేంద్రం నీరుగార్చే ప్రయత్నం



బాపట్ల అర్బన్: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ కూలీల పట్ల సవతి తల్లి ప్రేమను చూపుతూ.. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చే విధంగా ప్రధాని మోది వ్యవహరిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ ఆరోపించారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో గురువారం వ్యవసాయ కార్మిక సంఘ సమావేశం జరిగింది. సమావేశానికి జిల్లా నాయకుడు జల్ది భాగ్య శ్రీధర్ అధ్యక్షత వహించారు. ఆవుల శేఖర్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్లో గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు సక్రమంగా కేటాయించలేదన్నారు. ఉపాధి కూలీలకు వంద రోజులు పని కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్. వెంకట్రావు మాట్లాడుతూ గ్రామ, మండలాల్లో సంఘం శాఖలను ఏర్పాటు చేసి సభ్యత్వాలు, మహా సభలు నిర్వహించి సంఘం బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తన్నీరు సింగరకొండ మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘానికి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఈశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం హక్కుల కోసం నిరంతరం పోరాటాలే శరణ్యమన్నారు. సమావేశంలో 13 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా అద్దంకి నాగేశ్వరావు, ప్రధాన కార్యదర్శిగా జల్ది భాగ్య శ్రీధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ప్రేమకు ప్రతీక ఈద్-ఉల్-ఫితర్



భట్టిప్రోలు: ఈద్ సంబరాలకు ఈద్గాలు సిద్ధమయ్యాయి. ఈ నెల 22న ఈద్–ఉల్ –ఫితర్ జరుపుకునేందుకు ముస్లింలు సమాయత్తమవుతున్నారు. రంజాన్ పండుగను పేద, ధనిక తేడా లేకుండా ముస్లింలు జరుపుకోవాలని ఇస్లాం సూచిస్తోంది. ఈద్ నమాజ్‌కు వెళ్లే ముందు తప్పని సరిగా ఫిత్రా దానం చేయాలి. అప్పుడే ఈద్ నమాజ్ దైవామోదం అవుతుంది. అందుకే ఈ పండుగను ఈద్–ఉల్–ఫితర్ అని పిలుస్తారు. ఎలాంటి ఆటంకం లేకుండా 30 రోజుల పాటు ఉపవాస దీక్షలు పూర్తి చేసినందున అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ కూడా ఫిత్రా దానం చేయాలి. దీంతో ఉపవాస సమయంలో వచ్చిన చెడు తలంపుల నుంచి కూడా మోక్షం లభిస్తుంది. దుఆ (వేడుకోలు) ముగిశాక ఒకరికి ఒకరు ఈద్ ముబారక్ చెప్పుకోవాలి. దీంతో మనుషుల మధ్య ప్రేమ, ఆప్యాయత పెరుగుతాయని, అసూయా ద్వేషాలు సమసి పోతాయని భావిస్తారు. ఈద్ ప్రార్థనలు ముగిశాక ముస్లింలు తమ ముస్లిమేతర స్నేహితులను తమ ఇంటికి పిలిచి షీర్ ఖుర్మా తినిపిస్తారు. వారితో అలయ్ బలయ్ తీసుకుని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటారు. ఇది భిన్నత్వంలో ఏకత్వానికి సంకేతం.

పాలనపై సంతృప్తి.. భవిష్యత్తుపై భరోసా

- రెట్టించిన ఉత్సాహంతో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం
- ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ విధానాలను వివరిస్తున్న గృహ సారథులు, కన్వీనర్లు
- వారితో పాటు ప్రచారంలో పాలుపంచుకుంటున్న ప్రజా ప్రతినిధులు
- భట్టిప్రోలులో ఇంటింటికీ వెళ్లి సంక్షేమాన్ని వివరించిన మంత్రి మేరుగ
- కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని అధికారుల సమీక్షలో దిశానిర్దేశం



కర్లపాలెంలో ఎంపీటీసీ ఆసిఫ్ అలీ ప్రచారం



ఖాజీపాలెంలో స్టిక్కర్ల ఆవిష్కరణ..

భట్టిప్రోలు: 'జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం రెట్టించిన ఉత్సాహంతో ముందుకు సాగుతోంది. సచివాలయ గృహ సారథులు, కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వ విధి విధానాలు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు. గత, ప్రస్తుత ప్రభుత్వాల మధ్య వ్యత్యాసాలను వివరిస్తూ.. ప్రజా మద్దతు కూడగడుతున్నారు. ఇంటి పెద్ద అంగీకారంతో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను గృహానికి అంటిస్తున్నారు. మిస్డ్ కాల్ రూపంలో వారి మద్దతును తెలియజేస్తున్నారు.. వీరితో పాటు ప్రజా ప్రతినిధులు ప్రచారంలో పాల్గొంటున్నారు.

ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు..

ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చూసి జగనన్నే మా భవిష్యత్ అని ప్రజలు అంటున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున పేర్కొన్నారు. గురువారం సాయంత్రం భట్టిప్రోలులో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. సీఎం జగన్ పాలనలో సంతోషంగా ఉన్నామని వారు చెప్పడంతో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను ఇంటి గోడలకు అంటించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దారా రవి కిరణ్మయి, ఉప సర్పంచ్ బూర్లె రామ ప్రసాద్, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ గోవర్ధనగిరి శేషాచల శ్రీనివాసరావు(చినబుజ్జి), వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు(నాని), వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల నేతలు ఘాలి అరవింద, పీజీ అరుణ్‌శాస్త్రి, బండారు శ్రీనివాసరావు, మోర్ల కోటేశ్వరరావు, గోలి శ్రీనివాసరావు, కుక్కల వెంకట్రామయ్య, దారా చెన్నయ్య, పసుపులేటి శివరామ ప్రసాద్, మేడూరి వీరయ్య, నీలా రమేష్, కె. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కర్లపాలెం: కర్లపాలెం ఎంపీటీసీ సభ్యుడు షేక్ ఆసిఫ్ అలీ.. మండల ప్రజా పరిషత్ మాజీ కో–ఆప్షన్ సభ్యుడు షేక్ తాజుద్దీన్‌తో కలసి 3వ వార్డులో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించారు. వార్డు మెంబర్ షేక్ కరిముల్లా, బాజీబాబు పాల్గొన్నారు.

పిట్టలవానిపాలెం: కోమలి, ఖాజీపాలెం గ్రామాలలో మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షుడు దెందుకూరి సీతారామరాజు, సర్పంచ్‌లు శ్యామల కుంత నాగిరెడ్డి, కుంతం అనూష, వైఎస్సార్ సీపీ నాయకులు కుంతం ప్రసన్నరాజు, కూసం పూడి దేవేంద్రరాజు జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

చెరుకుపల్లి: వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పైనం ఏడుకొండలురెడ్డి పొన్నపల్లి, పలు గ్రామాల్లో గృహ సారథులు, సచివాయ కన్వీనర్లతో కలిసి ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు.

రేపల్లె: రేపల్లె పట్టణం 3, 5 వార్డుల కౌన్సిలర్లు చదలవాడ శ్రీనివాసరావు, నీలా లక్ష్మణబాబు, అరవపల్లిలో సర్పంచ్ బాబూ నాంచారయ్య, కైతేపల్లిలో సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు మండలి అంజయ్య ఇంటింటికీ పర్యటించి, ప్రభుత్వ పథకాలను వివరించారు.

భట్టిప్రోలు: భట్టిప్రోలులో అర్చకులు కార్తీకేయ శర్మ తన ఇంటికి తానే స్వయంగా జగన్ స్టిక్కర్‌ను గోడపై అంటించారు. రాష్ట్ర ప్రభుత్వ పాలనపై ప్రజల నుంచి ఫీడ్ బ్యాగ్ తీసుకున్నారు. పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని గుత్తావారిపాలెంలో ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ గోవర్ధనగిరి శేషాచల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భట్టిప్రోలు–1, 2 సచివాలయాల పరిధిలో జరిగిన ప్రచారంలో.. వేమూరు ఏఎంసీ వైస్ చైర్మన్ కొతరపు విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్య శాస్త్రి, ఎంపీటీసీ సభ్యురాలు కొతరపు పద్మావతి, ఉప సర్పంచ్ బూర్లె రామ ప్రసాద్, తలకొల యలమంద, వేల్పూరి బాలసుబ్రహ్మణ్యం, షేక్ అబ్దుల్ కరీమ్, పెరికల శ్యామ్, డొక్కు ప్రకాష్, కొలుసు శ్రీనివాసరావు, వేల్పూరి నాగేశ్వరరావు, దాసరి ఫణీంద్ర పాల్గొన్నారు.

చావలి(వేమూరు): జడ్పీటీసీ గాజుల హేమలత చావలి గ్రామంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. సొసైటీ చైర్మన్ గాజుల భాను ప్రకాశ్, కమ్మెల తిరుపతి రాయుడు, విష్ణు మొలకల రామోహనరావు, గాజుల వెంకట క్రిష్టరావు, సోమరౌతు నారాయణ, తోటకూర సత్యనారాయణ, కోటేశ్వరరావు, పాల్గొన్నారు.

పెరవలి(వేమూరు): గ్రామ సర్పంచ్ దాది వెంకట లక్ష్మీరాజ్యం పెరవలి గ్రామంలో గ్రామ సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు కలిసి ఇంటింటికీ తిరిగారు. సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. మండల కన్వీనరు దాది సుబ్బారావు, ఎంపీటీసీ దాది రజని తదితరులు పాల్గొన్నారు.

కొల్లూరు : సుగ్గునలంకలో ఎంపీటీసీ సభ్యులు సుగ్గున అశోక్‌కుమార్, ఆలపాటి నగరంలో జరిగిన కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ కొమ్ము గోపి ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు.

వేగవంతం చేయాలి.. ప్రత్యేక దృష్టి సారించాలి

'జగనన్నే మా భవిష్యత్తు'పై మంత్రి నాగార్జున సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున

వేమూరు: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. గురువారం వేమూరు వైఎస్సార్, ఆలపాటి ధర్మరావు మార్కెట్ యార్డులో వేమూరు నియోజకవర్గ స్థాయి ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో వలంటీర్ల విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇళ్లకు వెళ్లినప్పుడు ఇంటి పెద్ద ఫోన్ ద్వారా కాల్ సెంటర్‌కు మిస్డ్ కాల్ ఇప్పించడం లేదని ఆయన అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పంచాయతీ కార్యదర్శులు ప్రత్యే దృష్టి సాధించాలని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ డిప్యూటీ కలెక్టరు పి జాన్ లార్విన్, ఇన్‌చార్జీ ఎంపీడీఓలు సునీత, సత్యనారాయణ, చంద్ర శేఖర్, సుగుణమ్మ, కన్వీనర్లు దాది సుబ్బారావు, కొల్లూరు సుబ్బారావు, బట్టు మోషే పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



పొన్నపల్లి సచివాలయ వద్ద కన్వీనర్ ఏడుకొండలురెడ్డితో..



కైతేపల్లిలో కరపత్రం అందజేస్తున్న అంజయ్య



భట్టిప్రోలులో తన ఇంటి గోడపై స్టిక్కర్ అంటిస్తున్న కార్తీకేయ శర్మ



గుత్తావారిపాలెంలో పథకాలు వివరిస్తున్న ఎంపీపీ లలిత కుమారి



రేపల్లె పట్టణం 3వ వార్డులో కౌన్సిలర్ శ్రీనివాసరావు ప్రచారం

అలనాటి వైభవం..పిక్చర్ ప్యాలెస్‌లు

- రూపు కోల్పోతున్న టూరింగ్ టాకీస్‌లు
- జ్ఞాపకాల గుర్తులుగా మిగులుతున్న భవనాలు

భట్టిప్రోలు: తెలుగు వారి ప్రధాన వినోదం సినిమా. గ్రామీణ ప్రాంతాల్లో పండుగొచ్చినా..పబ్బమొచ్చినా.. కుటుంబంతో సహా చేరుకునేది సినిమా హాలుకే. నాడు సినిమాలు, పౌరాణిక, సాంఘిక నాటకాలపై గ్రామీణ ప్రజల్లో మక్కువ ఎక్కువ. ప్రతి పల్లెటూరిలో సినిమా హాలు తప్పనిసరి. రకరకాల వ్యాపకాలతో మానసిన ఒత్తిళ్లకు లోనైన ప్రజలు పొద్దుగూకే సరికి సినిమా హాలుకు వెళ్లి.. మానసిక ప్రశాంతతను పొందేవారు. నాడు ప్రేక్షకులతో కిక్కిరిసిన టూరింగ్ టాకీస్‌లు, పిక్చర్ ప్యాలెస్‌లో నేడు వెలవెలబోతున్నాయి. ప్రస్తుతం అరచేతికొచ్చిన ఓటీటీ వెర్షన్ సినిమాతో..థియేటర్‌లో అడుగు పెట్టేవారి సంఖ్య తగ్గిపోయింది. ముఖ్యంగా పల్లెల్లోని హాళ్ల పరిస్థితి నిర్వహణే కష్టంగా మారింది. అలవాటు పడ్డ కొందరు యజమానులు ఎలాగోలా నెట్టుకొస్తుండగా.. కొందరు కల్యాణ మండపాలుగా, గోదాములుగా మార్చేశారు. ఇలా కొన్ని శిథిలావస్థకు చేరి..అలనాటి వైభవానికి తీపి గుర్తులుగా మిగిలిపోయాయి.

మూతపడిన సినిమా థియేటర్‌లు..

అర్ధ శతాబ్దం పాటు భట్టిప్రోలు పరిసర గ్రామాల సినీ అభిమానులను అలరించిన శ్రీ దుర్గా పిక్చర్ ప్యాలెస్ (కొత్త హాలు) మూత పడి నేడు దుర్గా నగర్‌గా ఏర్పడింది. 1963 నవంబర్ 5న ప్రారంభమైన శ్రీ దుర్గా పిక్చర్ ప్యాలెస్‌లో తిరుపతమ్మ కథ సినిమా మొదటిసారి ప్రదర్శించారు. 1964లో లవకుశ సినిమా అర్ధ శత దినోత్సవం జరిగింది. దొంగ, ముగ్గురు మొనగాళ్ళు, ముఠామేస్త్రి వంటి సినిమాలు ఇక్కడ ప్రదర్శించారు. ఈ సినిమా హాలును స్వాతంత్ర్య సమర యోధుడు మద్దుల వెంకట గిరిరావు నిర్మించారు. ఐలవరం సమీపం శివంగులపాలెంలోని శ్రీ పద్మావతి థియేటర్ కూడా ప్రారంభించిన ఐదేళ్లకే మూతపడింది.



భట్టిప్రోలులో కనుమరుగైన దుర్గా పిక్చర్ ప్యాలెస్ (కొత్త హాలు)(ఫైల్)



శివంగులపాలెంలో మూతపడి సినిమా థియేటర్